క్లుప్తంగా

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలి

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటి ఆధ్వర్యంలో కవాడిగూడలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు తమ ఇండ్ల ముందు ఖాళీ సిలిండర్లను పెట్టి గంటెలతో మ్రోగిస్తూ వినూత్నంగా నిరసన చేశారు. ఐద్వా నగర కార్యదర్శి కె.నాగలక్ష్మి, సహాయ కార్యదర్శులు విమల, వరలక్ష్మిలు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలందరికి అచ్చేదిన్ అని చెప్పి సచ్చేదిన్ తెచ్చారనీ ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న దరలకు తోడు గ్యాస్ ధరలను విపరీతంగా పెంచడంతో ఖాళీ సిలిండర్లతో సంబరాలు చేసుకోవాలా అని ప్రశ్నించారు.

భక్తి శ్రద్ధలతో కుసుమ హరనాథ మహోత్సవం



నల్లకుంట: నల్లకుంట టీఆర్టీ కాలనీలో గల కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం శ్రీకుసుమ హరనాథ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుసుమ హరనాధులకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులచే నిర్వహించిన భజన ఆద్యంతం ఆకట్టుకుంది.

వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన



మాట్లాడుతున్న విజేంద్రసాగర్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అఖిల భారత సగర మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఉచిత వివాహ వేదికకు విశేష స్పందన లభించింది. 20 మంది జంటలకు అక్కడికక్కడే వివాహాలు కుదిరాయి. మహాసభ రాష్ట్ర అధ్యక్షులు శేసొట్టి విజేంద్రసాగర్, ప్రధాన కార్యదర్శి రాచకొండ హన్మంత్‌సాగర్, కోశాధికారి చాతిరి పార్థసారధి సాగర్ పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదును చేసుకోవాలి



ఓటరు నమోదును ప్రారంభిస్తున్న ముఠా జైసింహ

కవాడిగూడ: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదును చేసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం సీనియర్ నాయకులు ముఠా జైసింహ అన్నారు. భోలక్‌పూర్‌లోని శాంతి శ్రీ అపార్ట్‌మెంట్‌లో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 21 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటరు నమోదును చేసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు'



తెలంగాణ సాహితీ మహిళా ఫెస్ట్‌లో మాట్లాడుతున్న సలీమా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మన దేశంలో నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వారి జీవితాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని సీనియర్ జర్నలిస్టు సలీమా అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ సాహితీ మహిళా ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సలీమా మాట్లాడుతూ దేశంలో మహిళలు అన్ని విధాలుగా దూసుకుపోతున్నప్పటికి అణిచివేతకు, అవమానాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పురుషులతో సమానంగా స్త్రీలు పని చేస్తున్నప్పటికి సరైన గుర్తింపు లభించడం లేదన్నారు.

ముగిసిన త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలు



కళాకారుల 'భరత నాట్య ప్రదర్శన'

నల్లకుంట : శ్రీ రామ గానసభ ఆధ్వర్యంలో న్యూనల్లకుంటలోని శ్రీ సీతారాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో పారంభమైన సద్గురు త్యాగరాజ స్వామి వార్షిక ఆరాధన సంగీత మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం ఉంఛవృత్తి నిర్వహించిన జి.నాగరాజన్ భాగవతార్‌కు పాద పూజ చేశారు. అనంతరం నిర్వహించిన త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తనలు గోష్ఠి గానం ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది. సాయంత్రం ఉత్తరా సెంటర్ ఫర్ పెర్‌ఫామింగ్ ఆర్ట్స్ గీతా గణేషన్ శిష్య బృందం ప్రదర్శించిన 'భరత నాట్యం' ఆకట్టుకుంది. ఆంజనేయస్తుతితో ఆరాధనోత్సవాలు ముగిశాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు. శ్రీరామ గాన సభ కార్యదర్శి కొణికి సాయి శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న బీజేపీ మహాంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మహాంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి సి.కె.శంకర్‌రావు ఆరోపించారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ నాయకులు అంజయ్యనగర్, బొంతలబస్తీ, ఎల్బినగర్, కోదండరెడ్డినగర్‌లలో బీజేపీ నాయకులు పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు సంవత్సరాల తరబడి పూర్తి చేయకపోవడంతో అద్దె ఇళ్లల్లో కిరాయిలు కట్టలేక పేదలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బొంత బస్తీలో సర్వే పూర్తి చేసి నిధులు సైతం మంజూరు అయినప్పటికి నేటికి ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రమోహన్, అరుణ్‌కుమార్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ అటెండెన్స్ సమయం మార్చండి

కాచిగూడ: జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న తమ బయోమెట్రిక్ అటెండెన్స్ సమయ వేళలు మార్చాలని పారిశుద్ధ్య కార్మికులు జీహెచ్ఎంసీ కమీషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఉదయం 5 గంటల నుంచి 6 గంటలు, మధ్యాహ్న 1 గంట నుంచి 2 గంటల వరకు అటెండెన్స్ మార్చడంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పని చేస్తున్న ప్రాంతాలకు వచ్చే తమకు రవాణా సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వేసవిలో ఎండల తీవ్రత విపరీతంగా పెరుగుతుండటంతో ఎండలకు తాళలేక పోతున్నామని, దీంతో ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దివంగత ఎమ్మెల్యే సాయన్నకు ఘన నివాళి



సాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కవాడిగూడ: దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న జయంతి సందర్భంగా కవాడిగూడ డివిజన్ ఇందిరాపార్కు చౌరస్తాలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి హజరై నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ నగర సీనియర్ నాయకులు కల్వ గోపి, నాయకులు బల్లెకారి రాములు, హనుమంతరావు, మధు, శివ, నితీష్, కార్తీక్‌యాదవ్, సాయి, సన్నీ, సోను తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీజేపీ నేత మృతి



నేత బాల్‌రాజ్ (ఫైల్)

అంబర్‌పేట: అంబర్‌పేటలో నివాసముంటున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.బాల్‌రాజ్ ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఇతనికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఇతను గత 30 ఏళ్లుగా బీజేపీలో క్రియాశీల కార్యకర్తగా వివిధ పార్టీ పదవుల్లో కొనసాగుతూ..... పార్టీ అభ్యున్నతికి పనిచేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాగ్‌అంబర్‌పేట మోహిని చెరువు స్మశాన వాటికలో జరిగిన అంతిమ యాత్రలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు.ఈ సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎ.సోమయ్య తెలిపిన మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి (50) మలక్‌పేట - డబిల్‌పుర రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాం

రసూల్‌పురా: ఒలింపిక్స్ కామన్వెల్త్ ఏషియన్ గేమ్స్ తరపున పాల్గొనే క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ అందజేయడమే కాకుండా ఆయా దేశాల్లో జరిగే పోటీల్లో పాల్గొనే విధంగా క్రీడాకారులను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. యూనిటి స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో తిరుమలగిరి ఫుట్‌బాల్ మైదానంలో 16 రోజులుగా జరుగుతున్న కార్డినల్ డాక్టర్ పూల అంథోని ప్రైజ్‌మనీ ఫుట్‌బాల్ మొదటి టోర్నమెంట్ పోటీల ముగింపు వేడుకల్లో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే ఐదేళ్లలో క్రీడా రంగంలో అగ్ర దేశాల సరసన నిలిచి క్రీడా రంగంలో ముందంజలో ఉంటుందన్నారు. తిరుమలగిరి ఫుట్‌బాల్ మైదానంలో ఆడిన ఫుట్‌బాల్ క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ పోటీల్లో తలపడ్డారని గుర్తు చేశారు. క్రమశిక్షణతో క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొనాలని సూచించారు. ఓడిన వారు నిరాశతో ఉండరాదని భవిష్యత్‌లో గెలిచేందుకు కృషి చేయాలని సూచించారు. విజేత జట్టుకు రూ. 50 వేలు, రన్నరప్ జట్టుకు రూ.30 వేల నగదుతో పాటు ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ బాల శౌరి, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ, మాజీ వైస్ చైర్మన్ జైప్రకాష్. డాక్టర్ వికే. స్వామి, సీఈవో మధుకర్ నాయక్, ఆకాడమీ చైర్మన్ లూయిస్ అరుల్‌రాజ్ పాల్గొన్నారు.

దృష్టి మరల్చేందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు నాటకం

లాలాపేట: లిక్కర్ స్కాం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మహిళా రిజర్వేషన్ బిల్లు నాటకం ఆడుతున్నారని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత తొమ్మిదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉండి, పార్లమెంట్ సభ్యులుగా పని చేసినా ఏనాడు మహిళా రిజర్వేషన్‌పై ప్రస్తావించని ఎమ్మెల్సీ కవిత ఆకస్మికంగా మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం ఈ నెల 10న డిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి మంత్రివర్గంలో మహిళలకు ప్రాతినిధ్యం లేనప్పుడు మాట్లాడని కవిత, తెలంగాణలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అన్యాయాలపై ఏనాడు ప్రశ్నించలేదన్నారు. లిక్కర్ స్కాంలో అరెస్టు అవుతానని భయం ఆమెను వెంటాడుతున్న కారణంగానే మహిళా రిజర్వేషన్ బిల్లు కొత్త నాటకానికి తెర లేపారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి



అంబర్‌పేటలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

అంబర్‌పేట: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు పాదయాత్ర చేశారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ బడుగుల బాలకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగల సంగ్రామ పాద యాత్ర పేరిట నియోజకవర్గంలోని రఘునాథ్‌నగర్, బాపూనగర్ మీదుగా అలీకేఫ్ చౌరస్తా వరకు పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సోమశేఖర్, ఎడవెల్లి యాదయ్య, రమేష్, గణేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కాచిగూడ: మహిళలు కేవలం వంటింటికి మాత్రమే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత కోళీ ముదిరాజ్ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పొట్టకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ మహిళా అధ్యక్షురాలు మేకల శారద ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.



కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వర్లు ముదిరాజ్ తదితరులు

సీసీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్

కాచిగూడ: బర్కత్‌పుర రాఘవేంద్ర హోటల్ లేన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు నిర్మాణపు పనులను ఆదివారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, ఓంప్రకాష్, బి.భీమ్‌రాజ్, ఎస్ఎస్ రాము, జగ్గు, ఎస్.రవియాదవ్, ఆర్.సంతోష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

ఘనంగా మహిళాదినోత్సవ వేడుకలు

చిక్కడపల్లి: బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగానసభలో మహిళాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల మహిళలను ప్రతిభా అవార్డులతో సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆధ్యాత్మికవేత్త ఎస్.అనంతలక్ష్మి మాట్లాడుతూ మహిళలు వివిధ రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ముందుకు సాగిపోవాలన్నారు. కార్యక్రమంలో దివ్యరమణ చక్రవర్తుల, సుమలతశర్మ, బ్రాహ్మణ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఎవిఆర్‌మూర్తి పాల్గొన్నారు.

మానవీయ విలువలు బోధించాలి

రామంతాపూర్: కార్డినల్ గ్రాఫిక్స్ స్కూల్ వార్షికోత్సవాన్ని ఆదివారం స్థానిక లింగారెడ్డి గార్డెన్‌లో నిర్వహించారు. వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు మానవీయ విలువలను బోధించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల్లో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితిని వివరించే ప్రదర్శన ఆకట్టుకుంది. స్కూల్ చైర్మన్ సోదరుల మధుసూదన్, డైరెక్టర్ ధనలక్ష్మి, ప్రిన్సిపల్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

27న ఓయూ బడ్జెట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 2023-24 వార్షిక బడ్జెట్ ఈ నెల 27న సెనెట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఓయూకు 2023-24 విద్యా సంవత్సరానికి రూ.457.12 కోట్ల నిధులు కేటాయించిన విషయం విదితమే. ప్రతి ఏటా ఉద్యోగుల వేతనాలు, విశ్రాంత ఉ ద్యోగుల పింఛన్లకు బ్లాక్ గ్రాంట్స్ నిధులను వి నియోగించనున్నారు. యూనివర్సిటీ విద్యార్థు ల ఫీజులు, స్థిరాస్తులు, క్రీడా మైదానాలు, ఇతర వ నరుల నుంచి నిధులు రాబడుతుంది. అయి నా నిధులు సరిపోవడంల లేదని ఓయూకు రూ.10 00 కోట్ల నిధులు విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వేణుకుమార్‌కు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జాగ్రఫీ విభాగం నుంచి అవ్వారు వేణుకుమార్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. విశ్రాంత అధ్యాపకులు ప్రొ.లక్ష్మయ్య పర్యవేక్షణలో నల్గొండ జిల్లాలో భూవినియోగ మార్పులను రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్ సమాచారం అనే అంశం పై పరిశోధన పూర్తి చేసినందుకు డాక్టరేట్ డిగ్రీని పొందారు. తెలంగాణ ఎంటీసీల ఫోరం ఫౌండర్ చైర్మన్, ఎస్ఎఫ్ఐ నేతగా సేవలందించిన ఆయన ఇంతకు ముందు ఎల్ఎల్‌బీ పూర్తి చేసినట్లు తెలిపారు.

బోధనేతర సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న వంగూరి రాములు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న కస్తూరీ బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ) బోధనేతర సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటియూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కేజీబీవీ నాన్ టీచింగ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వంగూరి రాములు మాట్లాడుతూ కేజీబీవీలో పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం లేక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. 12-14 గంటల పాటు పని చేస్తున్న బోధనేతర సిబ్బందికి ఎలాంటి సౌకర్యాలు, హక్కులు లభించకపోవడం బాధాకరమన్నారు. యూనియన్ కార్యదర్శి కాసు మాధవి, నాయకులు కె.మంజుల తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ పాలనలో దళితులపై పెరిగిన దాడులు'



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న స్కైల్యాబ్‌బాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్రంలోని బీజేపీ పాలనలో దళితులపై దాడులు పెరిగాయని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.స్కైల్యాబ్‌బాబు విమర్శించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. స్కైల్యాబ్‌బాబు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బీజేపీ పాలన కొనసాగడం దురదృష్టకరమన్నారు. హిందుత్వ ఏజెండాను అమలు చేస్తూ దేశంలో అలజడులు సృష్టిస్తున్నారని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు పాల్గొన్నారు.

ఉచితంగా ఘంటసాల పుస్తకాలు పంపిణీ

చిక్కడపల్లి: శతాబ్ది గాయకుడు ఘంటసాల పాడిన 2006 పాటలు, పద్యాలు, శ్లోకాలతో డీవీవీఎస్ నారాయణ సంకలనపరచిన 150 పుస్తకాలను ఆదివారం గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో 150మంది అభిమానులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పుస్తక సంకలనకర్త డివివిఎస్ నారాయణ, అమ్మ ఆయుర్వేద మెడికల్స్ అండ్ జనరల్ ప్రొఫెసర్ పోతుకూచి ఉమాభట్టేశ్వరశర్మ పాల్గొన్నారు.



సన్మాన గ్రహీతలతో డివివిఎస్ నారాయణ, పోతుకూచి ఉమాభట్టేశ్వరశర్మ, డీవీకేదీక్షితులు

శివానంద్ నగర్‌లో 300వ నిత్య జనగణమన



కార్యక్రమంలో పాల్గొన్న కొల్లి నాగేశ్వర్ రావు.

నల్లకుంట: వందే ప్రజ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట శివానంద్‌నగర్‌లో 300వ రోజు నిత్య జనగణమన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన దివ్యాంగుల హక్కుల పోరాట యోధుడు, రైల్వే బోర్డ్ సభ్యుడు కొల్లి నాగేశ్వర్ రావు జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేసి మాట్లాడారు. వందే ప్రజా సంస్థ ఆధ్వర్యంలో గత మూడు వందల రోజులుగా నిత్య జనగణమన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

రామంతాపూర్: రామంతాపూర్ మౌంట్ ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. నగరంలోని ఇళ్లలో పని చేసే మహిళా కార్మికులు, మురికివాడల్లో నివసించే మహిళలు, ట్రాన్స్‌జెండర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్ మాట్లాడుతూ ఏ దేశంలో అయితే మహిళలు సాధికారత సాధించి ఆర్థికంగా బలపడతారో ఆ దేశం అభివృద్ధిలో ముందంజలో ఉంటుందన్నారు. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగంలో పనిచేసే మహిళలకు ఇంకా అనేక సౌకర్యాలు, వేతనాలు పెంచే అవసరం ఉందని, ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు.

కాకుమాను జ్యోతికి పురస్కారం



కాకుమాను జ్యోతిని సత్కరిస్తున్న స్వర రాగార్చన అధ్యక్షులు ఉలవలపూడి వెంకటరత్నం

కాచిగూడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వరరాగార్చన ఆధ్వర్యంలో ఆదివారం రాజమండ్రిలో నిర్వహించిన గానలహరి కార్యక్రమంలో కాచిగూడ ప్రాంతానికి చెందిన హెల్‌టాటా మని ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకుమాను జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కానుమాను జ్యోతిని ఆ సంస్థ ప్రతినిధులు అంతర్జాతీయ మహిళా పురస్కారంతో ఘనంగా సత్కరించి అభినందించారు. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలను గుర్తించి తనకు ఇంత పెద్ద గౌరవం అందించిన నిర్వహాకులకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

మహాసభలను జయప్రదం చేయాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

అడ్డగుట్ట: సీపీఐ సికింద్రాబాద్ మూడవ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో ఆదివారం అడ్డగుట్టలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ.. వచ్చేది అచ్చేదిన్ అంటూ అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలకు నిత్యావసరాలైన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ సామాన్య ప్రజల బతుకులపై భారం మోపుతుందన్నారు. మరోవైపు జాతీయ సంపద అంతా ప్రైవేటుపరం చేస్తూ ఆదానీ, అంబానీలకు దోచిపెడుతూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడం కోసం మత విద్వేషాలను రెచ్చగొడుతుందని ఆరోపించారు. అదే విధంగా సికింద్రాబాద్ నియోజకవర్గం సమస్యలకు కేరాఫ్‌గా మారిందన్నారు. సమస్యల పరిష్కారానికి అనేక దఫాలుగా పోరాటాలు చేసినప్పటికీ పాలకులు స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికై ఈ నెల 12న లాలాపేట్‌లో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో సీపీఐ నాయకులు ఉమర్‌ఖాన్, సోమయ్య, యాదగిరి, యూసుఫ్, లతీఫ్, మల్లేష్, చారి, ఖాజా, శంకరయ్య, పద్మ, నారాయణ పాల్గొన్నారు.